



గ్రంథాలయ ఉద్యోగుల సంఘ కార్యవర్గం

చిత్తూరు అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక స్థానిక ఎన్జీవో భవనంలో శుక్రవారం జరిగింది. ఎన్నికల అధికారిగా నాదెండ్ల బాబ్జి వ్యవహరించారు. ఏడు పదవులకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలవడంతో అందరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా తాళ్ల రవీంద్ర బాబు, ప్రధాన కార్యదర్శిగా తులసీనాయక్, ఉపాధ్యక్షుడిగా చంద్ర శేఖర్ నాయక్, సహాయ కార్యదర్శిగా వహబ్, కోశాధికారిగా అమర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా మురళి, విజయ్ ఎంపికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవులు, జిల్లా కార్యదర్శి రఘు వ్యవహరించారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు ఏడాది జైలుశిక్ష



గంభీరం

చిత్తూరు లీగల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి మృతికి కారకుడైన ఆర్టీసీ డ్రైవర్‌కి ఏడాది జైలుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. 2021 ఆగస్టు 19వ తేదీన పుత్తూరు నుంచి చిత్తూరు వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు గంగాధరనెల్లూరు మండలం అప్పిరెడ్డికండ్రిగ వద్ద ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న అదే మండలం గడ్డంపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని స్థానికులు చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతను చికిత్స పొందుతూ మృతి చెందాడు. గంగాధరనెల్లూరు పోలీసులు ఆర్టీసీ డ్రైవర్ గంభీరంపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు శుక్రవారం చిత్తూరులోని స్పెషల్ మొబైల్ కోర్టులో వాయిదాకు రాగా, నేరం రుజువైంది. దీంతో ఆర్టీసీ డ్రైవర్‌కు ఏడాది జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి వెన్నెల తీర్పు చెప్పారు. ఈ కేసును ఏపీపీ స్వాతి వాదించారు.

చిత్తూరు తహసీల్దార్ సంతకం ఫోర్జరీ

చిత్తూరు రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తన సంతకాన్ని ఫోర్జరీ చేశారని చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కళావతి తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇటీవల చిత్తూరు సంతపేటకు చెందిన వ్యక్తి ఓ స్థలానికి తహసీల్దార్ సంతకం, సీల్‌తో ఉన్న ఎంజాయిమెంట్ సర్టిఫికెట్‌తో రిజిస్టర్ చేయించుకోవడానికి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌కు వెళ్లాడు. సంతకాన్ని చూసిన సబ్ రిజిస్ట్రార్‌కు అనుమానం వచ్చి తహసీల్దార్‌కు ఫోన్ చేశారు. దీంతో ఆ సర్టిఫికెట్‌ను తెప్పించుకుని తహసీల్దార్ పరిశీలించగా, తన సంతకం ఫోర్జరీ చేసినట్లు గుర్తించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కొంతమందిని పిలిచి విచారించినట్లు సమాచారం. ఇందులో వీఆర్ఏల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు.

న్యూఢిల్లీలో రిపబ్లిక్ డే వేడుకలకు తొర్రూరు రైతులు


తిరుపతి(ఎంఆర్‌పల్లె), జనవరి 24(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో ఆదివారం జరిగే గణతంత్ర దిన వేడుకలకు ప్రత్యేక అతిథులుగా నగరి నియోజకవర్గంలోని పుత్తూరు మండలం తొర్రూరు గ్రామానికి చెందిన ఇద్దరు బిందు సేద్యం రైతులు ఎంపికైనట్లు తిరుపతి జిల్లా సూక్ష్మ నీటిపారుదల అధికారి సతీష్ తెలిపారు. బిందు సేద్యంతో పూల తోటలు పెంచుతూ అధిక దిగుబడి సాధించిన గజేంద్ర నాయుడు, ఉషారాణి దంపతులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

ఎన్నెన్నో అందాలు!

టూరిజం అభివృద్ధికి అపార అవకాశాలు

నేడు జాతీయ పర్యాటక దినోత్సవం

ఆధ్యాత్మిక క్షేత్రాలు, చారిత్రక కట్టడాలు, జలపాతాలతో పాటు ఆహ్లాదకర వాతావరణానికి చిత్తూరు జిల్లా పేరుగాంచింది. పర్యాటకపరంగా అభివృద్ధి చేసేందుకు అపార అవకాశాలున్నా ఆ దిశగా అడుగుపడడం లేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పర్యాటక శాఖ మంత్రిగా పనిచేసిన రోజా కూడా ఈ దిశగా కనీస ప్రయత్నం చేయలేదు. కూటమి ప్రభుత్వమైనా జిల్లాను పర్యాటకపరంగా అభివృద్ధి చేయాలని అందరూ కోరుకుంటున్నారు.



పెనుమూరు మండలంలోని పులిగుండు



ననియాలలోని ఎకో టూరిజం సెంటర్‌లోని ఏనుగులు

చిత్తూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):చిత్తూరు జిల్లాను టెంపుల్, ఎకో టూరిజం దిశగా అభివృద్ధి చేయడానికి అవకాశాలున్నాయి. పెనుమూరు మండలంలోని ఎన్టీఆర్ జలాశయం, కార్వేటినగరంలోని కృష్ణాపురం జలాశయం, యాదమరి మండలంలోని నుంజర్ల ప్రాజెక్టు, బైరెడ్డిపల్లె మండలంలోని కైగల్, పలమనేరులోని గంగన శిరస్సు జలపాతాలను అభివృద్ధి చేసేందుకు అవకాశాలున్నాయి. ప్రస్తుతమైతే ఈ ప్రాంతాలకు వెళ్లడానికి సరైన రోడ్లు కూడా లేవు.అలాగే పెనుమూరు మండలంలోని పులిగుండును పర్యాటక ప్రాంతంగా మరింత అభివృద్ధి చేసేందుకు అవకాశాలున్నాయి. కేంద్ర నిధులతో జిల్లా కేంద్రమైన చిత్తూరులో నగరవనం ఏర్పాటు చేసినా.. అందులో అరకొర సదుపాయాలే ఉన్నాయి.బోయకొండ గంగమ్మ ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు వస్తుంటారు.దీన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కూడా అవకాశాలున్నాయి.గత టీడీపీ ప్రభుత్వం అభివృద్ధి చేసిన రామకుప్పంలోని ననియాల ఎకో టూరిజం ప్రాజెక్టును విస్తరించి అభివృద్ధి చేయడం ద్వారా పర్యాటక అభివృద్ధికి మరిన్ని అవకాశాలున్నాయి. కాణిపాకం ఆలయానికి రోజురోజుకూ భక్తుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా టెంపుల్ టూరిజం అభివృద్ధి చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలి.పుత్తూరు సమీపం మూలవంక జలపాత పరిసరాలను అభివృద్ధి చేస్తే వారాంతాల్లో జిల్లాతో పాటు పొరుగున ఉన్న తమిళనాడు నుంచి కూడా పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తారు.

బైరెడ్డిపల్లె మండలంలోని కైగల్ జలపాతం



ఎలిఫెంట్ టూరిజానికీ..

పలమనేరు నియోజకవర్గంలో ఏనుగుల సమస్యను పరిష్కరించడంతోపాటు పర్యాటకంగానూ అభివృద్ధి చేసేందుకు అక్కడి ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ప్రయత్నిస్తున్నారు. పలమనేరు సమీపం ముసలిమడుగు అటవీప్రాంతంలోని 50 ఎకరాల్లో కుంకీ ఏనుగుల విడిదికి ఏర్పాట్లు చేస్తున్నారు.కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులు తీసుకొచ్చి మదపుటేనుగుల్ని కంట్రోల్ చేయడంతోపాటు ఎలిఫెంట్ టూరిజాన్ని కూడా అభివృద్ధి చేయనున్నారు.

పర్యాటక మంత్రిగా రోజా ఫెయిల్

వైసీపీ హయాంలో పర్యాటక శాఖ మంత్రిగా రెండేళ్లకుపైగా పనిచేసిన రోజా సొంత నియోజకవర్గానికి కూడా కనీసం ఒక్క మేలు చేయలేదు.పర్యాటక రంగంలో ఒక్క ప్రాజెక్టు కూడా తీసుకురాలేదు. కాణిపాకానికి సమీపంలో కొత్తపల్లె దగ్గర శిల్పారామం ఏర్పాటు చేస్తామని ఆమె ప్రకటించగా.. అధికారులు స్థలాన్ని పరిశీలించారు.ఆ తర్వాత అతీగతీ లేదు.

పింఛన్ల పునఃపరిశీలన



చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రత్యేక శిబిరానికి హాజరైన వికలాంగులు

- **నాలుగు కేంద్రాల్లో రోజుకు 50మంది వికలాంగుల చొప్పున వెరిఫికేషన్**

చిత్తూరు రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అర్హత లేకున్నా అక్రమంగా సంపాదించిన వైకల్య ధ్రువపత్రాలతో పింఛన్లు పొందుతున్న వారి ఏరివేతకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో పింఛన్ల పునఃపరిశీలన సదరం శిబిరం ప్రారంభమైంది. ఈ ప్రత్యేక శిబిరాల్లో లబ్ధిదారుల వైకల్య శాతాన్ని పరిశీలిస్తారు. అనర్హులుంటే గుర్తించి వివరాలను ఉన్నతాధికారులకు పంపనున్నారు.జిల్లాలో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి, కుప్పం, పలమనేరు, నగరి ఏరియా ఆస్పత్రుల్లో ఈ శిబిరాలను నిర్వహిస్తున్నారు.జిల్లాలో 37213 మంది అంగవైకల్యంతో పింఛన్లు పొందుతున్నారు. వీరిలో రూ.15 వేలు పొందుతున్న వారు 1936 మంది ఉన్నారు. మిగిలిన 35277 మంది వినికిడి, చూపు, లోకో మోటార్, మానసిక ఇబ్బందులతో రూ.6 వేల పింఛను పొందుతున్నారు. ఇది వరకే రూ.15 వేల పింఛన్లు పొందుతున్న 1936 మందిని వారి ఇంటికి వెళ్లి పరిశీలన కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఇప్పుడు వివిధ వికలత్వాలతో రూ.6 వేలు పొందుతున్న వారి వంతు వచ్చింది. రోజుకు 50 మంది చొప్పున వారానికి మూడు రోజులు పాటు ఈ శిబిరాలను నిర్వహిస్తున్నారు. వివిధ జిల్లాల్లోని వైద్యులను ఇక్కడ శిబిరాలకు...ఇక్కడ పనిచేస్తున్నవారిని వేరే జిల్లాలకు పంపి(జంబ్లింగ్ విధానం) పునఃపరిశీలన శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియ మార్చి నెలాఖరు నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు.

మార్చి చివరి కల్లా పూర్తి చేస్తాం



వికలాంగుల పింఛన్ల పునఃపరిశీలన కార్యక్రమాన్ని మార్చి నాటికి పూర్తి చేసే విధంగా ప్రయత్నిస్తున్నాం. వారానికి మూడు రోజులు పాటు క్యాంపులు నిర్వహిస్తున్నాం. మిగిలిన రోజులు ఆయా వైద్యులు వారి జనరల్ డ్యూటీలకు హాజరవుతారు.శిబిరానికి హాజరవ్వాల్సిన వారికి ముందుగా నోటీసులు ఇచ్చారు. వారు ఎక్కడ హాజరవ్వాలనే విషయాలన్నీ అందులో ఉంటాయి. క్యాంపులకు వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ ప్రభావతి,డీసీహెచ్ఎస్, చిత్తూరు

- **శిబిరాల్లో కనీస సౌకర్యాలు కరువు**

ప్రత్యేక పునఃపరిశీలన శిబిరాల్లో కనీస సౌకర్యాలు లేక వికలాంగులు ఇబ్బందులు పడుతున్నారు. గంటల తరబడి పరీక్షలకు వేచివుండాల్సి వుంటుంది. వికలాంగులతో పాటు మరో వ్యక్తి అతనికి తోడుగా ఉండాల్సి ఉంటుంది. అంటే ఒక్కో శిబిరంలో 100 మంది వరకు హాజరవుతారు. అయితే వారికి కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించకపోవడంపై వికలాంగులు, వారి బంధువులు బాధపడుతున్నారు.

ద్రావిడ వర్సిటీలో ముగిసిన న్యాక్ కమిటీ పరిశీలన



వీసీ, రిజిస్ట్రార్‌లతో సమావేశమైన న్యాక్ కమిటీ బృందం

గుడుపల్లె, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయ పరిశీలనకు వచ్చిన న్యాక్ కమిటీ పరిశీలన శుక్రవారంతో ముగిసింది. మూడు రోజుల విశ్వవిద్యాలయ పరిశీలనలో భాగంగా ద్రావిడ వర్సిటీలోని వివిధ విభాగాల తరగతి గదులు, గదులు, ల్యాబ్‌లు పరిశీలించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకొన్నారు. ఆయా శాఖాధిపతులు వారి శాఖల సంబంధించిన ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో కమిటీకి వివరించారు. పరిపాలన భవనంలో వీసీ ఆచార్య దొరస్వామి, రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్ కుమార్‌లతో సమావేశం నిర్వహించారు. మూడు రోజుల న్యాక్ కమిటీ పర్యటన విజయవంతం కావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. 2017లో ద్రావిడ విశ్వవిద్యాలయానికి న్యాక్ బి-ప్లస్ గ్రేడు రాగా.. ఈసారి ఏ గ్రేడ్ వస్తుందని అధికారులు పేర్కొన్నారు.



లాటరీ ద్వారా దుకాణాలను కేటాయిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

కల్లుగీత ఉప కులాలకు 10 మద్యం దుకాణాల కేటాయింపు

చిత్తూరు సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికుల్లోని వివిధ ఉపకులాలకు 10 ప్రభుత్వ మద్యం దుకాణాలను కలెక్టర్ సుమిత్ కుమార్ లాటరీ ప్రక్రియ ద్వారా కేటాయించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈడిగ కులస్తులకు ఏడు.. గౌడ, గౌండ్ల, గౌడ్ ఉపకులాలకు ఒక్కో దుకాణాన్ని కేటాయించారు. ఇందులో చిత్తూరు కార్పొరేషన్, పుంగనూరు, పలమనేరు నగరి మున్సిపాలిటీలు, చిత్తూరు రూరల్, గుడిపల్లె, వి.కోట దుకాణాలను 'ఈడిగ' ఉపకులానికి, పాలసముద్రం దుకాణాన్ని 'గౌడ' ఉపకులానికి, వెదురుకుప్పం దుకాణాన్ని 'గౌడ్' ఉపకులానికి, పెద్ద పంజాణి దుకాణాన్ని 'గౌండ్ల' ఉపకులానికి కేటాయించారు. ఈ మద్యం దుకాణాలకు సంబంధించి ఈనెల 27న గెజిట్ జారీ చేస్తామని, ఫిబ్రవరి ఐదో తేదీన లాటరీ నిర్వహించి.. దుకాణాలు అప్పగిస్తామని కలెక్టర్ తెలిపారు. అయితే గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమూర్తి, రాష్ట్ర గౌడ సంఘం కార్యదర్శి బుస్స నాగరాజులు కలెక్టర్‌తో మాట్లాడుతూ.. జిల్లాలో ఈడిగ కులస్తులు అధికంగా ఉన్నారని.. గౌండ్ల, గౌడ్ కులస్తులు లేరని చెప్పారు. గౌండ్ల, గౌడ్‌కు కేటాయించిన దుకాణాలను గౌడ కులస్తులకే ఇప్పించాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి తుమ్మల గోపి గౌడ్, చిత్తూరు నగర అధ్యక్షుడు వినోద్ గౌడ్, గీత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహేంద్ర, ఆట్లూరి శ్రీనివాసులు, గీత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ఈ ఆకతాయి చేష్టలు భరించలేం

మా ఊర్లో పాఠశాలే వద్దంటూ ఎం.కొత్తూరువాసుల నిరసన

ఎం.కొత్తూరు ఉన్నత పాఠశాల గేట్లు మూసివేసిన గ్రామస్తులు



నగరి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):నగరి మండల పరిధిలోని ఎం.కొత్తూరు ఉన్నత పాఠశాలకు శుక్రవారం ఉదయం గ్రామస్తులు తాళం వేసి నిరసన తెలిపారు.మాంగాడు దళితవాడకు చెందిన కొంతమంది పిల్లలు తమ ఊరి పిల్లలను తరచూ వేధిస్తూ ఇబ్బంది పెడుతున్నారని...కాబట్టి తమ ఊరిలో అసలు స్కూలే వద్దని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలోకి ఉపాధ్యాయులను,విద్యార్థులను పంపకపోవడంతో కొంతమంది టీచర్లు పోలీసులకు సమాచారమందించారు. సీఐ మహేశ్వర్ సిబ్బందితో కలిసి పాఠశాల వద్దకు చేరుకుని గ్రామస్తులతో చర్చించారు.పాఠశాలలో చదువుతున్న మాంగాడు దళితవాడకు చెందిన 10మంది విద్యార్థులు గురువారం ఎం.కొత్తూరుకు చెందిన విద్యార్థులను వారి ఇంటి వద్దకు వెళ్లి కొట్టడమే గాక మహిళలను నానా బూతులు తిట్టారని గ్రామస్తులు వివరించారు.గురువారం పాఠశాలలో జరిగిన చిన్నపాటి వివాదంతో ఓ విద్యార్థి ప్రహరీ దూకి బయటకు వెళ్లి గ్రామస్తులకు ఫోన్ చేయడంతో వారు ఎం.కొత్తూరుకు వచ్చి విద్యార్థుల ఇళ్లలోకి దూరి మరీ కొట్టారని, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో సైతం ఇలాంటివి జరిగినప్పుడు పోలీసులకు చెప్పినా సర్దిచెప్పి పంపేశారని గుర్తు చేశారు. టీచర్లు సైతం ఆ పిల్లలకు భయపడే పరిస్థితి ఉండడంతో పాఠశాలే తమ గ్రామంలో వద్దన్నారు.అయితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని సీఐ హామీ ఇవ్వడంతో శాంతించిన గ్రామస్తులు పాఠశాల గేట్లు తెరిచారు.ఒకప్పుడు 100శాతం ఫలితాలు సాధించిన తమ పాఠశాలలో 420మంది విద్యార్థులుండేవారని,పరిస్థితులు దిగజారడంతో ప్రస్తుతం 200 మంది మాత్రమే చదువుతున్నారంటూ కొత్తూరు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.ఉపాధ్యాయులు పాఠాలు చెబుతుండగా బల్లలను చరచడం, గోడదూకి వెళ్లడం, మరుగుదొడ్ల వద్దకు వెళ్లి గంజాయి సేవించడం, మహిళా టీచర్ల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం చేస్తున్నారని గ్రామస్తులతో బాటు టీచర్లు కూడా అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రశ్నించిన టీచర్లను ఆకతాయి విద్యార్థులు చొక్కా పట్టుకుని గుంజుతూ అవమానిస్తున్నారని, ఒక ఉపాధ్యాయుడేమో వారిని ప్రోత్సహించి విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్నారని వాపోయారు. ఎంఈవోలు శ్రీదేవి, నమఃశివాయ, డీవైఈవో ప్రభాకరరాజు తదితరులు అక్కడికి చేరుకుని పాఠశాల కమిటీ సభ్యులతో, గ్రామస్తులతో, టీచర్లతో విడి విడిగా చర్చించారు.డీవైఈవో ప్రభాకరరాజు మాట్లాడుతూ పరిస్థితిని సమీక్షించి ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.



పాఠశాల కమిటీ సభ్యులు, టీచర్లతో చర్చిస్తున్న ఎంఈవోలు

మా ముందే పిల్లల్ని కొట్టారు



రౌడీ విద్యార్థులు ఊర్లోకి వచ్చి మా ముందే మా ఇద్దరు పిల్లల్ని కొట్టారు.చంపేస్తారని భయపడి ఇంట్లో వేసి గడియపెట్టాం.క్రమశిక్షణ లేని ఇలాంటి విద్యార్థులుండే పాఠశాల మాఊరిలో వద్దు.

- వరలక్ష్మి,ఎం.కొత్తూరు

మర్యాద లేకుండా ప్రవర్తిస్తున్నారు



పాఠశాల నుంచి బయటకు వచ్చాక కొందరు విద్యార్థులు విచిత్రంగా ప్రవర్తిస్తున్నారు.ఊర్లో వారితో మర్యాద లేకుండా అసభ్యంగా మాట్లాడుతున్నారు.మోటార్ బైకులపై వచ్చి ఇళ్లలో దూరి కొడుతున్నారు.

- ఎతిరాజులు, ఎం.కొత్తూరు

21నుంచి ఐఐటీలో తిరుత్సవ్



3డీ మ్యాప్‌లో ఐఐటీ క్యాంపస్

ఏర్పేడు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీ తిరుత్సవ్-2025 వేడుకలకు సిద్ధమైంది. ఫిబ్రవరి 21 నుంచి 23వ తేదీ వరకు ఈ టెక్నో కల్చరల్ ఫెస్ట్ జరగనుంది.పలు ఈవెంట్లు, సాంకేతిక పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు, వర్క్‌షాపులు, ఎగ్జిబిషన్లు ఉండనున్నాయి. ఆకట్టుకునే సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ విద్యార్థులు పోటీపడనున్నారు. తిరుత్సవ్ సన్నాహాల్లో భాగంగా ఐఐటీ కళాశాల క్యాంపస్‌లో ఇంటరాక్టివ్ నేపథ్య 3డీ మ్యాప్‌ను విద్యార్థులు అభివృద్ధి చేశారు. ఈవెంట్‌కు హాజరయ్యే వారికి ఆకర్షణీయమైన సాధనంగా 3డీ క్యాంపు మ్యాప్ ఉంటుందని విద్యార్థులు భావిస్తున్నారు.

ఓటరు చైతన్యంతోనే దేశ ప్రగతి

● నేడు జాతీయ ఓటరు దినోత్సవం

చిత్తూరు సెంట్రల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఓటు అనేది ఐదేళ్లకోసారి వచ్చే అవకాశం కాదు. మన చేతిలో ని బలమైన ఆయుధం.సమర్థులైన పాలకులతోనే ప్రజాస్వామ్యంలో ప్రగతి సాధ్యమవుతుందన్న అవగాహనతో ప్రజలు సరైన అభ్యర్థులను ఎన్నుకున్న నాడు దేశాభివృద్ధి వేగవంతమవుతుంది.'ఓటరు చైతన్యంతోనే దేశ ప్రగతి' నినాదంతో అర్హులందరికీ ఓటు హక్కును చేరువ చేయడానికి భారత ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు అనేక కార్యక్రమాలను చేపడుతోంది.

ఓటు హక్కు పొందాలంటే ఒకప్పుడు ఎంతో కష్టపడాల్సి వచ్చేది. రోజులు, వారాలు, నెలలు కాదు, ఏకంగా ఏడాది నుంచి మూడేళ్లు సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరిగితే కానీ ఓటు హక్కు లభించేది కాదు. 15 ఏళ్లుగా ఎన్నికల సంఘం ఓటరులో చైతన్యం కల్పించడంతోపాటు నమోదు కార్యక్రమంలో పలు మార్పులు తీసుకొచ్చింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని అర్హత కలిగిన ప్రతి పౌరుడూ ఓటరుగా నమోదు అయ్యేందుకు నిరంతర ప్రక్రియగా మార్చింది. మరోవైపు ఆన్‌లైన్‌లో ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌తో ఓటు నమోదు సులభతరమైంది.

ఇంటికే ఓటరు స్లిప్పులు

గతంలో రాజకీయ పార్టీల నాయకులు ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించి తమకు నచ్చిన వారికి ఓటు వేయించుకునే వారు. ఓటరు క్రమ సంఖ్య, పేరు, బూత్, ప్రాంతం అంతా వివరాలు పార్టీ నేతలు చెబితేనే తెలిసేది. వారిచ్చే ఓటరు స్లిప్పుల ఆధారంగానే ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రాల్లోని అధికారులు సైతం మొగ్గు చూపేవారు. నాటి సంప్రదాయాలకు ఎన్నికల సంఘం స్వస్తి పలికింది. బూత్ స్థాయి అధికారుల ద్వారా ఓటరు ఇంటికే ఓటు వివరాల స్లిప్పులు అందిస్తోంది. నడవలేనివారితో పాటు వృద్ధులకు హోం ఓటింగ్ పేరుతో ఇంటివద్దే ఓటేసే అవకాశాన్ని అందుబాటుకి తెచ్చింది. దివ్యాంగులకు, యువతకు, మహిళలకు ప్రత్యేక పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది.

యువతరానికి అవకాశం

18 ఏళ్ల నిండిన యువత.. ఓటరుగా నమోదు చేసుకోడానికి ఏటా నాలుగు సార్లు జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబరు నెలల్లో ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి ఓటు నమోదుకు వీలు కల్పించింది.

15.68 లక్షల మంది ఓటర్లు

జిల్లా ఎన్నికల సంఘం తాజా లెక్కల ప్రకారం 2025 జనవరి 25వ తేదీనాటికి జిల్లాలో 15,68,788 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళా ఓటర్లు 7,96,637 మంది, పురుషులు 7,72,079, ట్రాన్స్‌జెండర్లు 72మంది, ఎన్ఆర్ఐ ఓటర్లు 168 మంది ఉన్నారు. ఓటర్లు అత్యధికంగా పలమనేరు నియోజకవర్గంలో 2,69,065 మంది ఉండగా, నగరి నియోజకవర్గంలో అత్యల్పంగా 2,02,709 మంది ఉన్నారు.



జిల్లాలో ఓటర్లు

వయస్సు	ఓటర్లు
18-19	20,446
20-29	2,73,267
30-39	3,90,412
40-49	3,87,580
50-59	2,44,559
60-69	1,54,395
70-79	75,335
80+	22,794
మొత్తం:	15,68,788

సీనియర్ సిటిజన్లకు సన్మానం



ఓటరు దినోత్సవంలో భాగంగా శనివారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహించే కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లకు సన్మానం చేయనున్నాం. పలువురికి అవార్డుల ప్రదానంతో పాటు యువ ఓటర్లకు ఎపిక్ కార్డులను పంపిణీ చేయనున్నాం. జిల్లా వ్యాప్తంగా ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేశాం.

- సుమిత్ కుమార్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్

యువతలో చైతన్యం కల్పిస్తున్నాం



తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునే యువతలో చైతన్యం నింపుతున్నాం. యువత దేశానికి వెన్నెముకే కాదు ఓటు హక్కులో కూడా ప్రధాన భూమిక పోషించాలని ఉత్తేజాన్ని నింపుతున్నాం. 18 ఏళ్ల నిండిన వారిని ఓటరుగా నమోదు చేసే ప్రక్రియను నిరంతరంగా కళాశాలలో చేపడుతున్నాం. ఇందుకోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

- జీవనజ్యోతి, ప్రిన్సిపాల్, పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఆడ, మగ బిడ్డలను సమానంగా చూడాలి

ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి

చిత్తూరు అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు ఆడ, మగ బిడ్డలను సమానంగా చూడాలని ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి అన్నారు. శుక్రవారం చిత్తూరు బాలాజీనగర్ ప్రభుత్వ పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. సమాజంలో ఎన్నో రకాలైన ఇబ్బందులను మహిళలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. మహిళా డీఎస్పీ విజయ్‌శేఖర్ మాట్లాడుతూ.. పిల్లలు ఫోన్లకు బానిసలై పోయారని, అందులో మంచిని మాత్రమే తీసుకోవాలని సూచించారు. జిల్లా మెడికల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మోహన్ మాట్లాడుతూ.. ఆడ పిల్లలందరూ చదువుకోవాలని చెప్పారు. అనంతరం ఆడ పిల్లని రక్షిద్దాం.. ఆడ పిల్లని చదివిద్దాం అని జిల్లా బాలల పరిరక్షణ అధికారి బాలసుబ్రహ్మణ్యం ప్రతిజ్ఞ చేయించారు. జాతీయ బాలిక దినోత్సవంలో భాగంగా పిల్లలకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి ప్రశంసాపత్రాలను అందించారు. జీసీడీవో ఇంద్రాణి, దిశ ఎస్ఐ నాగసౌజన్య, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వాసంతి, వన్‌స్టాప్ సెంటర్, చైల్డ్‌లైన్ అధికారులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారం సత్వరం జరగాలి: కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో సూచనలు ఇస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు సెంట్రల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారం సత్వరం జరగాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీతో కలిసి పీజీఆర్ఎస్ అర్జీలపై ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులు బాధ్యతగా పనిచేసి, సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. ఆర్థిక పరమైన సమస్యలు మినహా.. మిగిలిన వాటిని నిర్దీత గడువులోపు పరిష్కరించాలని స్పష్టం చేశారు. పరిష్కరించలేనివి ఎందుకనే పూర్తి వివరణ ఇవ్వాలని సూచించారు.

26న కులగణనపై చర్చావేదిక

పుంగనూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా బీసీలు, కాపులకు ప్రత్యేక రిజర్వేషన్లు, కులగణనపై ఈనెల 26న విజయవాడలో బీసీవై పార్టీ ఆధ్వర్యంలో చర్చావేదిక నిర్వహించనున్నట్లు ఆ పార్టీ అధినేత బి.రామచంద్రయాదవ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా రాజకీయ పార్టీలకు అతీతంగా విజయవాడ బందరు రోడ్డులోని లెమన్‌ట్రీ హోటల్‌లో చర్చ జరుగుతుందన్నారు. స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో 39 శాతానికి రిజర్వేషన్ పెంచాలనే అంశాలపై చర్చిస్తామని తెలిపారు. మహారాష్ట్రలో అక్కడి ప్రభుత్వం మరాఠీలకు ఐదుశాతం రిజర్వేషన్ కల్పించిందని, ఏపీలో కాపులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న కులగణన, మండల కమిషన్‌లపై చర్చ జరుగుతుందని.. మేధావులు, కాపు సంఘ నాయకులు, యువజన సంఘాలు, చర్చవేదికలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

విద్యతోనే మహిళలకు ఉజ్వల భవిష్యత్తు



సెమినార్‌లో పాల్గొన్న వారికి ధ్రువపత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేసులు

పలమనేరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్య మహిళల జీవనశైలినే మారుస్తుందని.. ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ రాధ అన్నారు. పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన మహిళా సాధికారత సెమినార్‌లో ప్రొఫెసర్ రాధ హాజరై మాట్లాడారు. మారుతున్న ప్రపంచీకరణ వ్యవస్థలో ఆధునిక మహిళలకు విద్య అవసరమన్నారు. బెంగళూరు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎస్.ఆర్.కేశవ మాట్లాడుతూ మహిళా సాధికారత ప్రపంచంలో ఎలా ఉందో గణాంకాలతో వివరించారు. మద్రాసు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సునీలాశ్యాం మాట్లాడుతూ మహిళలను పురుషులతో సమానంగా చూస్తేనే సమాజంలో మార్పు వస్తుందన్నారు. అనంతరం పలువురు ప్రొఫెసర్లు మాట్లాడారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేసులు సదస్సును నిర్వహించిన డాక్టర్ రుక్మిణిని అభినందించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ గీతాంజలి(హైదరాబాద్), కల్పనా క్రిష్టయ్య (ఎస్.కె.యూనివర్సిటీ), ప్రొఫెసర్ వైవీఆర్ రాజు(మద్రాసు వర్సిటీ), తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారుల భవిష్యత్తును రాజకీయం చేయొద్దు



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

తిరుపతి(వైద్యం), జనవరి 24(ఆంధ్రజ్యోతి): నిజానిజాలు తెలుసుకోకుండా చిన్నారుల భవిష్యత్తును రాజకీయం చేయడం సబబు కాదని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. నగరిలో లైంగిక వేధింపులకు గురై తిరుపతిలో చికిత్స పొందుతున్న చిన్నారిని ఆయన శుక్రవారం పరామర్శించారు. ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. మానవీయ కోణంలో చూడాల్సిన ఈ విషయాన్ని రాజకీయం చేయడం మానుకోవాలని హితవుపలికారు. ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామన్నారు. చిన్నారిపై అత్యాచారం జరిగిందా లేదా అనే విషయాన్ని వైద్య పరీక్షల అనంతరమే వెల్లడిస్తామని పేర్కొన్నారు. సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డి ఆయన వెంట ఉన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించండి

కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్



సంజీవరాయనిపల్లె వద్ద ఉన్న ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్ సిబ్బందితో మాట్లాడుతున్న వీరపాండియన్

చిత్తూరు సెంట్రల్/పూతలపట్టు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ సుమిత్ కుమార్‌తో కలిసి మాతాశిశు పరిరక్షణ, వ్యాధి నిరోధక కార్యక్రమాలు, ఆస్పత్రి భవన నిర్మాణాలు, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్, ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డు తదితర అంశాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించారు. వైద్య సేవల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 76,629 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షల్లో భాగంగా స్క్రీనింగ్ చేశామన్నారు. 3,500 మందికి కంటి అద్దాలు అందించామని చెప్పారు. గత ఏడాది నవంబరు 14 నుంచి జనవరి 15వ తేదీవరకు 612 సచివాలయాల పరిధిలో 3.0 కింద 84579 గృహాల సర్వే చేపట్టి హైబీపీ, మధుమేహం, నోరు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ ఉన్నవారికి సేవలు అందించినట్లు వివరించారు. అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, డీఎంహెచ్‌వో సుధారాణి, డీసీహెచ్ఎస్ ప్రభావతి, పీఆర్ఎస్ఈ చంద్రశేఖర్, ఎన్టీఆర్ వైద్య సేవ కోఆర్డినేటర్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

వైద్యాధికారులు, వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని కమిషనర్ కోరారు. పూతలపట్టు మండలంలోని సంజీవరాయనిపల్లె వద్ద ఉన్న ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్‌ని తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. డీఎంహెచ్‌వోతోపాటు అడిషినల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, డీఐవో హనుమంతరావు, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ దేవి, సీహెచ్‌వో శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు



హత్య కేసులో నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ కృష్ణమోహన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు

కల్లూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం ఆవులపెద్దిరెడ్డిగారిపల్లి సమీపంలోని వ్యవసాయ పొలంలో ఈనెల 18న జరిగిన హత్య కేసులో ముగ్గురు నిందితులను శుక్రవారం కల్లూరు పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు పంపారు. పూతలపట్టు సీఐ కృష్ణమోహన్, కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు..

ఆవులపెద్దిరెడ్డిగారిపల్లికి చెందిన ప్రభాకర్ (55)కు వెంకటదాసరపల్లి పంచాయతీ అరికెలవారిపల్లికి చెందిన సుబ్బయ్యకు ఈనెల 13న పంట పొలంలోకి పశువులను తోలిన విషయంపై గొడవ జరిగింది. దీంతో ప్రభాకర్‌పై సుబ్బయ్య కక్ష పెంచుకొని పథకం ప్రకారం ఈనెల 18న సుబ్బయ్య తన కుమారుడు శివశంకర్, తమ్ముడి కుమారుడు మహేష్ (22), వెంకటదాసరపల్లి పంచాయతీ చెరుకువారిపల్లికి చెందిన గిరి (33)తో కలిసి ప్రభాకర్ వ్యవసాయ పొలం వద్దకు చేరుకున్నారు. పొలం వద్ద ఉన్న ప్రభాకర్‌పై దాడి చేయాలని సూచించాడు. దాడిని గుర్తించిన ప్రభాకర్ పారిపోతుండగా శివశంకర్ తన చేతిలోని కత్తిని ప్రభాకర్‌పై విసరడంతో అదే కత్తిని ప్రభాకర్ తీసుకుని శివశంకర్ మెడపై వేయడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. శివశంకర్ వెంట వచ్చిన మహేష్, శివ వెంటనే ప్రభాకర్ చేతిలోని కత్తిని లాక్కొని ప్రభాకర్‌పై దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య భూలక్ష్మీ ఫిర్యాదు మేరకు కల్లూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులు సుబ్బయ్య, మహేష్, గిరిని అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండు నిమిత్తం కోర్టుకు తరలించారు. నిందితులకు ఫిబ్రవరి 6 వరకు రిమాండు విధించారు. మెడపై తీవ్రగాయమైన మరో నిందితుడు శివశంకర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తిరుపతిలో 'అప్పరెల్' మాల్

● దావోస్‌లో మంత్రి లోకేశ్‌ను కలిసిన సంస్థ చైర్మన్ నీలేష్ వేద్



తిరుపతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గ్లోబల్ ఫ్యాషన్ సంస్థ అప్పరెల్ గ్రూప్ తిరుపతిలో లైఫ్‌స్టైల్ ఫ్యాషన్ మాల్‌ను ఏర్పాటుచేసేందుకు ఆసక్తి చూపుతున్నట్టు తెలుస్తోంది. ఆమేరకు దావోస్‌లో మంత్రి నారా లోకేశ్‌ను అప్పరెల్ గ్రూప్ చైర్మన్ నీలేష్ వేద్ కలిసి చర్చించారు. తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి తమ ఇష్టదైవమని ఎప్పటినుంచో తిరుపతిలో ఫ్యాషన్ మాల్ ఏర్పాటుచేయాలని అనుకున్నట్టు చెప్పినట్టు సమాచారం. 24వేల మందికి పైగా ఉద్యోగులు, 85 అంతర్జాతీయ బ్రాండ్లతో 14 దేశాలలో 2300 మాల్స్ ఉన్నాయి. ఉత్తరాదికి చెందిన నీలేష్ తన అప్పరాల్ మాల్‌ను తిరుపతిలో ఏర్పాటుచేస్తే వెయ్యిమందికిపైగా ఉపాధి అవకాశాలతో పాటు నగరానికి సరికొత్త బ్రాండింగ్ వస్తుందని ఫ్యాషన్ ప్రేమికులు చెబుతున్నారు. త్వరలోనే ఆ గ్రూప్ ప్రతినిధులు తిరుపతికి వచ్చి పరిశీలించనున్నట్టు తెలిసింది.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడి బలి

● అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య



తిరుపతి(నేరవిభాగం), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగులతో అప్పుల పాలై.. ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం తిరుపతిలో చోటుచేసుకుంది. ఈస్ట్ ఎస్ఐ మహేష్ వివరాల మేరకు.. అనంతపురం ఉమ్మడి జిల్లా కదిరికి చెందిన షేక్‌నూర్ మహ్మద్ ముబారక్.. నగరంలోని కరకంబాడిలో ఉంటూ అమర ఆస్పత్రిలో మేల్ స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడిన ఇతడు.. లక్షలాది రూపాయలు అప్పులు చేశాడు. వీటిని తీర్చలేకపోవడం, రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడంతో శుక్రవారం తిరుపతిలోని ఒక లాడ్జిలో గది అద్దెకు తీసుకుని విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంతకూ ఈయన బయటకు రాకపోవడంతో లాడ్జి నిర్వాహకులు ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సిబ్బందితో కలిసి ఎస్ఐ మహేష్ అక్కడికి చేరుకుని తలుపులు పగులగొట్టి చూడగా ముబారక్ మృతిచెంది ఉన్నాడు. పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు మృతదేహాన్ని తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మానసిక వికలాంగురాలిపై అత్యాచారం

తిరుపతి(నేరవిభాగం), జనవరి 24(ఆంధ్రజ్యోతి): మానసిక వికలాంగురాలైన బాలికపై ఆటోడ్రైవర్ అత్యాచారానికి పాల్పడిన ఘటన శుక్రవారం తిరుపతి రూరల్‌లో చోటు చేసుకుంది. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు.. మానసిక వికలాంగురాలితో ఆటోడ్రైవర్ శివప్రసాద్ నాయక్ పరిచయం పెంచుకున్నాడు. తరచూ వారి ఇంటికి వెళ్లి వచ్చేవాడు. శుక్రవారం తెల్లవారుజామున ఆ బాలికకు మాయమాటలు చెప్పి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆమె గట్టిగా అరవడంతో బాలిక తల్లి చూసి ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లింది. రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ కేసు నమోదు చేసి, డ్రైవర్‌ను అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు.

దావోస్ పర్యటనతో యువతకు నిరాశే: రోజా

నగరి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): దావోస్ పర్యటన ద్వారా రాష్ట్రానికి నాలుగు లక్షల ఉద్యోగాలు వస్తాయని ఆశ పెట్టుకున్న యువతకు నిరాశే మిగిలిందని మాజీమంత్రి రోజా విమర్శించారు. నగరిలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రానికి పెట్టుబడులు రాకపోవడానికి రెడ్‌బుక్ పాలనే కారణమని ఆరోపించారు. సీఎం చంద్రబాబు తన కొడుకు లోకేశ్‌ను నేషనల్ మీడియాలో ప్రమోట్ చేసుకోవడానికి ప్రయత్నించారని మండిపడ్డారు. దావోస్‌కు డిప్యూటీ సీఎంను తీసుకెళ్లలేదంటేనే చంద్రబాబు చతురత అర్థమవుతోందన్నారు.

మల్లిమడుగులో ట్రెంచ్‌ల ఏర్పాటు



రేణిగుంట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మల్లిమడుగు రిజర్వాయరు నుంచి మట్టి అక్రమ రవాణాకు అడ్డకట్ట వేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఆ మేరకు శుక్రవారం ట్రెంచ్‌లను ఏర్పాటు చేశారు. మల్లిమడుగు రిజర్వాయరులో మట్టి తవ్వకాలపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దారు సురేష్‌బాబు ఆదేశాలతో వీఆర్వో బాబు, రెవెన్యూ సిబ్బంది ట్రెంచ్‌ల ఏర్పాటు పనులు చేపట్టారు. రిజర్వాయరులోకి వెళ్లే అన్నిమార్గాల్లో వాహనాలు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు.

కల్కి ట్రస్ట్ భూ ఆక్రమణలపై ఎన్జీటీలో కేసు పెట్టా: నార్నె

తిరుపతి(ఆటోనగర్), జనవరి24(ఆంధ్రజ్యోతి): కల్కి ట్రస్ట్ భూ ఆక్రమణలు, అక్రమాలపై మద్రాసు నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ (ఎన్జీటీ)లో కేసు నమోదు చేశామని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. బీఎన్ కండ్రిగ మండలం కల్లివెట్టు సమీపం సర్వే నెంబరు 295లోని అంజూరు సమీపంలోని అటవీశాఖలో 20.75 ఎకరాల డీప్ ఫారెస్ట్ భూమిని కల్కి ట్రస్ట్ నిర్వాహకులు ఆక్రమించి పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నారన్నారు. దీనిపై అటవీ, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. అందుకని కల్కి ఆశ్రమ నిర్వాహకులు, అటవీ శాఖ అధికారిని బాధ్యులుగా చేసి నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్‌లో కేసు వేశామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో డాక్టర్ ఏఆర్ రెడ్డి, బాధితుడు మునిచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, బహిరంగ మద్యపాన నిషేధం

ఇవీ తొలి ప్రాధాన్యాలు

● పోలీసులు ప్రజలకు జవాబుదారీతనంగా ఉండేలా చర్యలు
● రథసప్తమికి తొక్కిసలాటకు వీల్లేకుండా ఏర్పాట్లు
● ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన హర్షవర్ధన రాజు



తిరుపతి(నేరవిభాగం), జనవరి 24(ఆంధ్రజ్యోతి): గంజాయి నివారణ, బహిరంగ మద్యపాన నిషేధం.. తన తొలి ప్రాధాన్యాలని నూతన ఎస్పీ హర్షవర్ధనరాజు చెప్పారు. ఇంకా ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిలో ప్రశాంత వాతావరణం కల్పించే పోలీసు యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తానన్నారు. నూతన ఎస్పీగా నియమితులైన హర్షవర్ధనరాజు శుక్రవారం సాయంత్రం తిరుపతిలోని ఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గంజాయి అక్రమ రవాణా, బహిరంగ మద్యపానం నిషేధంపై ఉక్కుపాదం మోపి బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ప్రత్యేక బృందాలు నిరంతరం గస్తీ నిర్వహించేలా చర్యలు చేపడతామన్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై ఇప్పటికే జిల్లాలో ఉన్న బృందాలను మరింత బలోపేతం చేస్తామన్నారు. తిరుపతి ప్రజలకు మళ్లీ సేవ చేసే భాగ్యం కలగడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, డీజీపీ ద్వారకా తిరుమలరావు తనపై ఉంచిన గురుతర బాధ్యతను చిత్తశుద్ధితో నెరవేర్చుతానన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అటువంటి పొరపాట్లు మళ్లీ జరగకుండా చర్యలు తీసుకుంటానని ఎస్పీ హర్షవర్ధనరాజు పేర్కొన్నారు. పోలీసుల్లో ప్రజల పట్ల జవాబుదారీ తనం పెంచడానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణలో అహర్నిశలు పనిచేసి ప్రజల్లో పోలీసులంటే ఒక నమ్మకం, స్నేహపూర్వక వాతావరణం తీసుకొస్తానన్నారు. సాయంత్రం పూట ప్రతి పోలీసు రోడ్లపై కనపడే విధంగా విజిబుల్ పోలీసింగ్ తీసుకొస్తానన్నారు. తిరుపతిలో ట్రాఫిక్ నియంత్రణకు ఆటో డ్రైవర్లు, వివిధ వాహనాల యజమానులు, నిర్వాహకులతో సమావేశమై చర్యలు చేపడతామన్నారు. కార్పొరేషన్ అధికారులతో సమన్వయం చేసుకుని ఫ్రీ ట్రాఫిక్ ఏర్పాటు చేయడానికి ముందస్తు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పాత ఘటనలు పునరావృతం కాకుండా తిరుమలలో వచ్చే నెల 4న జరగనున్న రథ సప్తమికి అవసరమైన ప్రాంతాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. పోలీసుల్లో మనోధైర్యం తీసుకు వచ్చి వారిలో పనిచేసే వాతావరణం కల్పిస్తామని చెప్పారు. అనంతరం అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, వెంకట్రావు, రామకృష్ణ, శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు ఎస్పీని కలిసి అభినందనలు తెలిపారు. కాగా, ఉదయం తిరుమల శ్రీవారిని ఎస్పీ హర్షవర్ధనరాజు దర్శించుకున్నారు.

పాలిటెక్నిక్ కోర్సులతో ఉజ్వల భవిష్యత్తు


పాలిటెక్నిక్ కోర్సులపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కుప్పం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి తర్వాత పాలిటెక్నిక్‌లో పలు డిప్లమో కోర్సులతో యువతకు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని వైవీ జేమ్స్ యెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.జగన్నాథరావు అన్నారు. శుక్రవారం కుప్పంలోని బాలుర, బాలికల హైస్కూళ్లలో పాలిటెక్నిక్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తగరతి అనంతరం పలు డిప్లమో కోర్సులను అభ్యసించడంతో పరిశ్రమలో సులువుగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో స్థిరపడొచ్చన్నారు. పాలిసెట్-2025 మే నెలలో నిర్వహిస్తారని, ఇందుకు ఇప్పటి నుంచే విద్యార్థులు సిద్ధం కావాలని తెలిపారు. ఇందుకు విద్యార్థులకు ఉచిత కోచింగ్‌తో పాటు స్టడీ మెటీరియల్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పది పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సయ్యద్ హుసేన్, రమేష్, హెచ్‌ఎంలు వెంకటేష్, ప్రతిభ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

27న మహా కుంభాభిషేక వేడుకలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నేతలు

కుప్పం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కుప్పం పాతపేట మునస్వామిపురంలో నెలకొన్న నల్ల గంగమ్మ ఆలయ మహాకుంభాభిషేక పోస్టర్లను శుక్రవారం కుప్పం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈనెల 27న నూతన దేవతామూర్తుల విగ్రహాల గ్రామోత్సవం, 28న మహాగణపతి హోమం, వేదపారాయణం, నూతన విమాన గోపుర కలశ ప్రతిష్ఠాపన, సుదర్శన హోమం జరుగుతుందన్నారు. 29న విగ్రహ ప్రాణప్రతిష్ఠ, హోమం, మహా కుంభాభిషేక మహోత్సవం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కుప్పం మాజీ ఎంపీపీ డా.వెంకటేష్, మాజీ జడ్పీటీసీ రాజ్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గురికానివారిపల్లెలో పశువులకు వైద్య సేవలు


మేకలకు చికిత్సలు అందిస్తున్న పశువైద్యాధికారి చందనప్రియ

సోమల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గురికానివారిపల్లెలో శుక్రవారం పశు వైద్య శిబిరం నిర్వహించి డాక్టర్ చందనప్రియ చికిత్సలు అందించారు. 180 పశువులకు పిడుదల మందు పిచికారీ చేయడంతోపాటు 700 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది అలీ, బావాజాన్, నరసింహారెడ్డి, బలరాం తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలి


మంత్రి కొల్లురవీంద్రను కలిసిన రవి తదితరులు

పలమనేరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంబీసీ కులాల అభివృద్ధికి సీడ్ సర్వే నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. పలు మండలాల్లో ఇందుకు సంబంధించిన సర్వే నత్తనడకన సాగుతోంది. త్వరగా ఈ సర్వే పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రను రాష్ట్ర సంచారజాతుల సంఘం నాయకులు పూసల రవి కోరారు. విజయవాడలో ఆయన సంచార జాతుల సంఘ నాయకులతో కలిసి మంత్రిని కలిశారు.

వైభవంగా ఆలయ కుంభాభిషేకం

పెద్దపంజాణి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పెద్దపంజాణి మండలం గోనుమాకులపల్లెలో శ్రీవిద్యా వరసిద్ధి వినాయకస్వామి నూతన ఆలయ నిర్మాణంలో విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రెడ్డెప్పరెడ్డి, మాజీ ఎంపీపీ విజయభాస్కరరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో పలమనేరు సూపర్‌బజార్ చైర్మన్ బాలాజీ, లయన్స్ క్లబ్ మాజీ చైర్మన్ అమరనాథరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, ఎంపీపీ రెడ్డెప్ప, ఎంపీడీవో బాలాజీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి


మొగిలప్ప (ఫైల్ ఫొటో)

పలమనేరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని మదనపల్లి రోడ్డుపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మొగిలప్ప(73) మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. ద్విచక్రవాహనంపై వెళ్తున్న మొగిలప్ప ముందు వెళ్తున్న ట్రాక్టర్ బ్రేక్ వేయడంతో ద్విచక్రవాహనాన్ని అదుపు చేస్తున్నాడు. ఈక్రమంలోనే వెనుకవైపు నుంచి వచ్చిన ఆటో మొగిలప్పను ఢీకొంది. ప్రమాదలో తీవ్రంగా గాయపడిన అతడిని పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిషన్ వాత్సల్య పథకం నిధుల మంజూరు


పిల్లల సంరక్షకులకు పత్రాలను పంపిణీ చేస్తున్న శిరీష

రొంపిచెర్ల జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మిషన్ వాత్సల్య పథకంలో కేంద్ర ప్రభుత్వం మండలంలో తల్లిదండ్రులు లేని ఐదుగురి పిల్లలకు రూ.2.40 లక్షలు మంజూరైనట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష తెలిపారు. తల్లిదండ్రులు లేని పిల్లలు వెంకట్రమణ, కల్పన, అంజలి, రమ్యశ్రీ, దర్శినిలకు ఒక్కొక్కరికి నెలకు రూ.4 వేలు వంతున ఏడాదికి రూ.48 వేలు మంజూరైందని.. వారిక ఖాతాల్లో జమైనట్లు పేర్కొన్నారు. శుక్రవారం పిల్లల సంరక్షకులకు పత్రాలను అందించారు.

పటిష్ఠంగా పాఠశాలల విలీనం

- పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి


విద్యాశాఖ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : నూతన విద్యావిధానం ప్రకారం విద్యార్థుల సంఖ్య ఆధారంగా చేపడుతున్న పాఠశాలల విలీనం పటిష్ఠంగా జరగాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి విద్యాశాఖ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన పలమనేరులో విద్యాశాఖ అధికారులతో శుక్రవారం రాత్రి సమీక్షించారు. విద్యార్థుల హాజరు శాతంతో పాటు విలీనానికి అవకాశం ఉన్న పాఠశాలల వివరాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకొన్నారు. ఎలాంటి అసౌకర్యం లేకుండా పాఠశాలల విలీనం జరగాలని .. అధికారులు ఇష్టానుసారంగా చేపడితే డ్రాపౌట్స్ పెరిగే అవకాశం ఉందన్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ఎంఈవోలు చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో పలమనేరు, పెద్దపంజాణి, గంగవరం, బైరెడ్డిపల్లి, వి.కోట ఎంఈవోలు లీలారాణి, గోపాల్‌రెడ్డి, తులసీరాం, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, చంద్రశేఖర్, మురుగేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిటాల సునీతకు కాణిపాకం ప్రసాదాలు


పరిటాల సునీతకు కాణిపాకం ప్రసాదాలు అందజేస్తున్న నాయకులు

కల్లూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం వెంకటాపురంలో శుక్రవారం నిర్వహించిన దివంగత మాజీ మంత్రి పరిటాల రవీంద్ర వర్ధంతి వేడుకల్లో పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లికి చెందిన టీడీపీ నాయకులు గోపినాయుడు, పరంధామనాయుడు, మనోహరశెట్టి, సందీప్ పాల్గొన్నారు. ముందుగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, యువ నాయకుడు పరిటాల శ్రీరామ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కాణిపాకం వినాయకస్వామి ప్రసాదాలు అందించారు. అనంతరం పరిటాల రవీంద్రకు నివాళులు అర్పించారు.

జరిమానాలు చెల్లించకుంటే వాహనాలు స్వాధీనం

రొంపిచెర్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ఏడాది పాటు విధించిన జరిమానాలు చెల్లించకుండా తిరుగుతుంటే వాహనాలను సీజ్ చేస్తామని ఎస్‌ఐ సుబ్బారెడ్డి తెలిపారు. రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు ఉంచుకొని వాహనాలు నడపాలన్నారు. గతంలో విధించిన జరిమానా మీసేవా, సచివాలయంలో చెల్లించి రశీదు పొందాలని సూచించారు.

నేడు మామిడి సస్యరక్షణపై అవగాహన సదస్సు

వి.కోట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఈనెల 25న శనివారం వి.కోట వెలుగు కార్యాలయం ఆవరణలో మామిడి రైతులకు సస్యరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఉద్యానశాఖాధికారిణి లక్ష్మీప్రసూన తెలిపారు. ఈ అవకావాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి


డ్రైవర్లకు శుభాకాంక్షలు తెలుపుతున్న డిపో మేనేజర్ స్వామి

పలమనేరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా శుక్రవారం పలమనేరు ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న డ్రైవర్లకు డిపో మేనేజర్ స్వామి రోజా పూలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడికి గాయాలు

పుంగనూరు రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు - రామసముద్రం మార్గంలోని నరసాపురం వద్ద ద్విచక్రవాహనం అదపుతప్పి ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. వివరాలిలా.. చౌడేపల్లె మండలం పుదిపట్ల గ్రామానికి చెందిన రామకృష్ణ కుమారుడు అశోక్(21) ద్విచక్రవాహనంలో అన్నమయ్య జిల్లా రామసముద్రానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో నరసాపురం వద్ద వస్తుండగా వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో అశోక్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 సాయంతో పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు.

ప్రత్యేక అలంకరణలో విరూపాక్షి మారెమ్మ

పుంగనూరు రూరల్, జనవరి24(ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షిమారెమ్మ శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి వేప, మామిడి ఆకులతో తోరణాలు కట్టి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు ఉపవాసాలతో చీరలు, రవికలు మొక్కులుగా చెల్లించి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

వాటర్‌ప్లాంట్‌కు భూమిపూజ


భూమిపూజలో పాల్గొన్న మున్సిపల్ కౌన్సిలర్ మురళీ

పలమనేరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పలమనేరు గుండుబావి వద్ద ఎంపీ నిధులు రూ.4.90 లక్షలతో మంజూరైన వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మురళీ, మహిళలు పాల్గొన్నారు.

బాలికలకు చదువే విలువైన ఆభరణం


పుంగనూరులో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ అయిషా నస్రీన్‌తాజ్


పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మానవహారం

పుంగనూరు రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బాలికలకు విద్యయే విలువైన ఆభరణమని.. ప్రతిఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అయిషా నస్రీన్ తాజ్ కోరారు. శుక్రవారం పట్టణంలోని లినార్డు మున్సిపల్ పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల సంరక్షణ బాధ్యత ప్రతిఒక్కరూ తీసుకోవాల్సిన అవసర ముందన్నారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఉషా, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● సోమల: కందూరు, నంజంపేట ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నంజంపేటలో హెచ్‌ఎం కుసుమాంబ మాట్లాడుతూ ప్రస్తుత సమాజానికి బాలికల ప్రాధాన్యత ఎంత అవసరమన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హరిత, ఉపాధ్యాయులు వసంతకుమారి, స్వాతి, దేవిక తదితరులు పాల్గొన్నారు.

● కల్లూరు: బాలికల రక్షణను అందరి బాధ్యతగా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్వైజర్లు విజయలక్ష్మీ, రమాదేవి తెలిపారు. పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాలికలతో ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం నానికనాయక్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

●రొంపిచెర్ల: రొంపిచెర్ల కస్తూరిబా విద్యాలయంలో శుక్రవారం జరిగిన బాలిక దినోత్సవంలో వైద్యాధికారి డాక్టర్ వినయ్ విద్యార్థులకు పలు సూచనలు అందించారు. డాక్టరు దినేష్‌కుమార్‌నాయక్, ఎస్‌ఐ సుబ్బారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

●పలమనేరు: స్థానిక బాలికోన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలిక దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా స్వీయరక్షణ, బాల్యవివాహాలు, మహిళా పోలీసు చట్టాలు, హెల్ప్‌లైన్, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బాలికా విభాగం సమన్వయకర్త శశికళ, ఎంఈవో లీలారాణి, సీడీపీవో ఇందిరా ప్రియదర్శిని, డాక్టర్ హేమలత, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేసులు, సూపర్‌వైజర్ నజ్మా, హెచ్‌ఎం లత పాల్గొన్నారు.

● బైరెడ్డిపల్లె: బాలికలు అన్ని రంగాల్లో రాణించి ఉన్నతస్థాయికి ఎదగాలని బైరెడ్డిపల్లె వైద్యాధికారి విజయచందర్ అన్నారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల, దేవదొడ్డి ప్రాథమికోన్నత పాఠశాలల్లో శుక్రవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు గౌహర్‌సుల్తానా, శాంతమ్మ, ఆరోగ్యవిద్యాధికారులు సావిత్రి, కాంతమ్మ పాల్గొన్నారు.

●చౌడేపల్లె: బాల్య వివాహాలను నిర్మూలించాలని ఎంఈవో తిరుమలమ్మ సూచించారు. శుక్రవారం స్థానిక హైస్కూల్‌లో బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో అమరజ్యోతి, హెచ్‌ఎం పద్మజ, సూపర్‌వైజర్లు రమాదేవి, సులోచన, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చౌడేపల్లె అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి

చౌడేపల్లె, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని తెల్లనీళ్లపల్లెలోని టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి అతిథిగృహంలో టీడీపీ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రదీప్‌రాజు, ఉయ్యాల రమణ, సీవి రెడ్డి, మాధవరెడ్డి, జంపాల శ్రీనివాసులునాయుడు, చంద్రమౌళి, వేలూరు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం తరలింపు కేసులో ముగ్గురి అరెస్టు


ముగ్గురి అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

పుంగనూరు రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యం తరలింపు, విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు పుంగనూరు ఎక్సైజ్ సీఐ సురేశ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సోమల మండలం పేటూరు వద్ద నాటు సారా విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేయగా పేటూరుకు చెందిన మునెప్ప కుమారుడు రెడ్డెప్ప(50) పట్టుబడ్డాడని తెలిపారు. అతడి నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని. రెడ్డెప్పకు నాటుసారా సరఫరా చేస్తున్న పెద్దపంజాణి మండలం గంకొండపాళ్యంకు చెందిన రాజేశ్ పరారీ అయినట్లు తెలిపారు. అలాగే గురికానిపల్లెలో దాడులు చేయగా కనుమప్ప కుమారుడు హరినాథ్(38) పట్టుబడగా అతని వద్ద 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని అతడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. చౌడేపల్లె మండలం తిరుమనపల్లెలో రెడ్డెప్ప కుమారుడు నరేశ్(39) కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా పట్టుకుని 48 ప్యాకెట్లు మద్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అదే గ్రామానికి చెందిన శంకర్‌రెడ్డి కుమారుడు మహేశ్‌రెడ్డి పరారీలో ఉన్నట్లు వివరించారు. వీరిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐ వేణుగోపాల్‌రెడ్డి, సిబ్బంది నాగరాజు, ఢిల్లీబాబు, సురేంద్రరెడ్డి, నరేంద్ర శ్వేత, మమత, సుబ్రహ్మణ్యంగౌడు, కిషోర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు వాసవీ క్లబ్ నూతన కమిటీ ఏకగ్రీవం


సమావేశంలో మాట్లాడుతున్న ముల్లంగి విజయకుమార్

పుంగనూరు రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు వాసవి క్లబ్ నూతన అధ్యక్షుడిగా అమరావతి రామకుమార్, వనిత క్లబ్ అధ్యక్షురాలిగా వేముల శ్రీలతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గవర్నర్ ముల్లంగి విజయకుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని గూడూరుపల్లె లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలో జరిగిన కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వాసవి జిల్లా గవర్నర్ తేజయశస్విని గుప్తా, కేబినెట్ కార్యదర్శి కోమలాదేవి, వినయ్‌కుమార్, రమ్యరమేశ్, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు బాలసుబ్రహ్మణ్యం, ప్రతినిధులు శేషప్పగుప్తా, సుకుమార్, ఉషా ప్రభాకర్‌రావు, కృష్ణమూర్తి, సంధ్య, అశ్వత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై కఠిన చర్యలు

- పలమనేరు ఆర్డీవో భవాని


మిట్టూరులో విచారణ చేస్తున్న ఆర్డీవో భవాని

వి.కోట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలో ఆక్రమణలపై కఠినంగా వ్యవహరించాలని పలమనేరు ఆర్డీవో భవాణి తహసీల్దార్‌కు సూచించారు. ఇటీవల వివాదాస్పదంగా మారిన షాదీమహాల్ స్థలాన్ని ఆమె శుక్రవారం పరిశీలించారు. రికార్డులు సమర్పించాలని ఆదేశించారు. అనంతరం వి.కోట రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని పలు రికార్డులపై సూచనలు చేశారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దారు పార్వతి, ఆర్‌ఐ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్తపై దాడి

సోమల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కందూరులో గురువారం రాత్రి జనసేన కార్యకర్త మునీర్‌పై అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు శుక్రవారం జనసేన నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కందూరు బస్టాండులో జనసేన కార్యకర్త మునీర్ దుకాణం వద్ద టీ తాగుతూ స్థానిక టీడీపీ నాయకులను దూషించాడు. దీంతో టీడీపీ కార్యకర్తలు మునీర్‌పై దాడి చేసి చితకబాదారు. గాయపడిన అతడిని జనసేన కార్యకర్తలు, నాయకులు 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చౌడేపల్లె సీఐ రాంభూపాల్ ఆధ్వర్యంలో విచారణ చేపడుతున్నారు.

పురుగులమందు తాగి పెయింటర్ మృతి

పుంగనూరు రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందినట్లు పుంగనూరు అర్బన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం మేరకు.. పట్టణంలోని మోతీనగర్‌కు చెందిన మునీర్‌అహ్మద్(50) పెయింట్ పనులు చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. కొంత కాలంగా మూర్ఛవ్యాధితో బాధపడుతుండేవాడు. బీడీలు, సిగిరెట్లు తాగరాదని డాక్టర్లు చెప్పినా వినకుండా తాగుతుండగా భార్య నూర్జాన్ మందలించడంతో రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నాటుసారా విక్రేత అరెస్టు

పుంగనూరు రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నాటు సారా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని శుక్రవారం సాయంత్రం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రాజేశ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని పత్రపల్లెతాండాకు చెందిన దారునాయక్ కుమారుడు శంకర్‌నాయక్ సారా విక్రయిస్తుండగా అరెస్టు చేశారు. సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని మహిళకు గాయాలు

పుంగనూరు రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పుంగనూరు- మదనపల్లె మార్గంలోని భీమగానిపల్లె బస్టాప్ వద్ద లారీ ఢీకొని ఓ మహిళ గాయపడిన సంఘటన శుక్రవారం జరిగింది. భీమగానిపల్లెకి చెందిన వెంకటలక్ష్మి (60) పట్టణంలోని బాలాజీ ప్రైవేటు ఆసుపత్రిలో పని చేసుకుని జీవనం సాగిస్తోంది. శుక్రవారం సాయంత్రం పనులు పూర్తి చేసుకుని ఇంటికి వెళుతూ రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొంది. ప్రమాదంలో ఆమె గాయపడగా కుమారుడు హరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అనకాపల్లెకు చిత్తూరు కబడ్డీ జట్లు

పుంగనూరు రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లెకు చిత్తూరు కబడ్డీ జట్లు బయలుదేరినట్లు చిత్తూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి గంగాధర్ తెలిపారు. ఈనెల 25 నుంచి 28 వరకు అనకాపల్లెలో జరిగే రాష్ట్రస్థాయి అండర్-17 కబడ్డీ పోటీలకు చిత్తూరు జట్టు వెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు.

నిధుల వినియోగంపై రికార్డులు తప్పనిసరి


24పీజీఆర్‌కేఎల్ఆర్2: గ్రామసభలో మాట్లాడుతున్న డీఆర్‌పీ బుజ్జి

సోమల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడులకు కేటాయిస్తున్న నిధుల వినియోగంపై రికార్డులు తప్పనిసరిగా నమోదు చేయాలని సామాజిక తనిఖీ అధికారి సుధాకర్ తెలిపారు. శుక్రవారం కందూరు హైస్కూల్‌లో 28 రకాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ఉపాధ్యాయుల బోధన పద్ధతులపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజన పథకం అమలు, వంట నిర్వాహకులతో సమీక్షించారు. హెచ్‌ఎం వెంకట్రమణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●కల్లూరు: పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచికరంగా లేదని విద్యార్థులు సామాజిక తనిఖీ దృష్టికి తీసుకొచ్చినట్లు ఎస్‌ఆర్‌పీ బుజ్జి, డీఆర్‌పీ సురేంద్రరెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ కమిటీ, తల్లిదండ్రులతో సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. సామాజిక తనిఖీల వివరాలను గ్రామసభలో చదివి వినిపించారు. హెచ్‌ఎం శ్రీవాణి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●చౌడేపల్లె: విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని డీఆర్‌పీ శివకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పుదిపట్ల హైస్కూల్‌లో సామాజిక తనిఖీ నిర్వహించారు. హెచ్‌ఎం పద్మజ, ఎస్‌ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి



ఖాళీ బిందెలతో మహిళల నిరసన

చిన్నబాపనపల్లె దళితవాడలో తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

శ్రీరంగరాజపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నెల రోజులుగా తమకు తాగునీటి సమస్య ఉందని చిన్నబాపనపల్లె దళితవాడకు చెందిన మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం గ్రామంలో ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. నెల కిందట తాగునీటి మోటరు రిపేరు అయిందని, తర్వాత నాలుగు రోజులకు ఒక్కసారి గ్రామంలో ట్రాక్టర్ ద్వారా తాగునీరు అందించారన్నారు. కానీ ఆ నీరు గ్రామానికి సరిపోలేదని సర్పంచ్ తెలియజేసినా పట్టించుకోలేదని వాపోయారు. మరోవైపు తమకు బిల్లు రాలేదని, వారం రోజులుగా ట్రాక్టర్ ద్వారా సరఫరా చేస్తుండిన నీటినీ ఆపేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తమ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

డప్పు కళాకారుల వృత్తి నైపుణ్యంపై పరిశీలన

పింఛను పొందుతున్న వారిలో అనర్హుల గుర్తింపు కోసమే..

పాలసముద్రం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 13 పంచాయతీల్లో పింఛను పొందుతున్న డప్పు కళాకారుల వృత్తి నైపుణ్యాన్ని పరిశీలించే కార్యక్రమాన్ని తహసీల్దార్ అరుణకుమారి ప్రారంభించారు. మండలంలో మొత్తం 49 మంది డప్పు కళాకారులు పింఛను తీసుకుంటున్నారు. వీరిలో అనర్హులుంటే వారిని గుర్తించి.. తమకు నివేదికలు పంపాలని జిల్లా అధికారులు తహసీల్దార్ లేఖ పంపారు. దీంతో రోజూ ఒక్కో పంచాయతీలోని లబ్ధిదారులను పిలిపించి పరిశీలిస్తామని తహసీల్దార్ చెప్పారు. శుక్రవారం పాలసముద్రం పంచాయతీలో ఉన్న డప్పు కళాకారుల వృత్తి నైపుణ్యాన్ని పరిశీలించారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట డప్పు కొడుతున్న కళాకారులు

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టండి

పెనుమూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని డీఎల్‌పీవో పార్వతి, డీపీవో సుధాకరరావు తెలిపారు. శుక్రవారం వారు ఎంపీడీవో కార్యాలయంలో సెక్రటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. వారు మాట్లాడుతూ తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ఎస్‌డబ్ల్యూపీసీల నిర్వహణలో ప్రణాళిక రూపొందించుకుని పనులు చేపట్టాలని సూచించారు. ఇంటి పన్నులు వసూలు చేయడంలో అలసత్వం వహించరాదని చెప్పారు. ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఈవోపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న డీఎల్‌పీవో పార్వతి, వేదికపై డీపీవో సుధాకరరావు

నగరంలో 'శిఖండి' సందడి

చిత్తూరు కల్చరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): శిఖండి సినిమా యూనిట్ సభ్యులు శుక్రవారం నగరంలో సందడి చేశారు. సినిమాలో అందరూ చిత్తూరువాసులే నటించారని దర్శకుడు, నిర్మాత కోడి కిషోర్ తెలిపారు. అనంతరం శ్రీ వెంకటేశ్వర థియేటర్‌లో ప్రేక్షకులతో కలిసి సినిమాను వీక్షించారు.



శ్రీవెంకటేశ్వర థియేటర్ ముందు సినిమా యూనిట్ సభ్యులు

విద్యార్థుల శ్రమదానం

బంగారుపాళ్యం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మంగళపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విజయం ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు శుక్రవారం శ్రమదానం చేశారు. పాఠశాల ఆవరణాన్ని శుభ్రపరిచి, మొక్కలు నాటారు. అనంతరం జాతీయ బాలికల సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం రాజ్యలక్ష్మి, టీచర్లు పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడమే ధ్యేయం

గుడిపాల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పేదలను ఆదుకోవడమే జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ ధ్యేయమని నిర్వాహకుడు చెన్నకేశవులునాయుడు అన్నారు. శుక్రవారం మండలం నుంచి మేల్‌మరువత్తూరుకు ఐదు బస్సులను ఉచితంగా ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు ఓంశక్తి బస్సులకోసం 150 బస్సులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుర్రప్ప నాయుడు, ఓంశక్తి భక్తులు పాల్గొన్నారు.



మేల్‌మరువత్తూరుకు బయల్దేరుతున్న బస్సు

పాత బస్టాండుకు రక్షణ కవచం





పాతబస్టాండు చుట్టూ ఏర్పాటు చేస్తున్న రేకుల కంచె

చిత్తూరు అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు పాత బస్టాండు స్థలానికి నగరపాలక అధికారులు రక్షణ కవచాన్ని ఏర్పాటు చేశారు. ఈనెల 20వ తేదీన 'కోట్లాది రూపాయల స్థలం.. అసాంఘిక కార్యకలాపాలకు నిలయం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన నగరపాలక అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. శుక్రవారం పాత బస్టాండు చుట్టూ రేకులతో కంచె ఏర్పాటు చేశారు. ఇక్కడున్న పండ్ల వ్యాపారులను పీసీఆర్ వద్ద కొత్తగా నిర్మించిన స్టాళ్లకు, కూరగాయల దుకాణదారులను రైతు బజారులో పెట్టుకోవాలని సూచించామని అధికారులు పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకూడదు: డీపీవో

వెదురుకుప్పం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) సుధాకరరావు ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. పారిశుధ్య నిర్వహణ, ట్యాంకుల నిర్వహణపై నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను మార్చి నెలాఖరుకంతా పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవాలని చెప్పారు. పచ్చికాపల్లం, కొమరగుంట చెత్త సేకరణ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు, ఈవోపీఆర్డీ పురుషోత్తంకు పలు సూచనలిచ్చారు. ఎంపీడీవో ఎ.అమరనాథ్, ఏవో నాగరాణి, పంచాయతీ ఉద్యోగులు పాల్గొన్నారు.



ఈవోపీఆర్డీకి సూచనలిస్తున్న డీపీవో సుధాకరరావు

ఈ రోడ్డును బాగు చేయరూ..



వెదురుకుప్పం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం ఎంఎం విలాసం గ్రామ పంచాయతీ ఎస్‌ఆర్‌కండ్రిగ గ్రామ రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ రోడ్డును బాగు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

మురుగు తొలగించలేరా?

పూతలపట్టు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ముత్తిరేవుల వద్ద మురుగు నిల్వ చేరడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ముత్తిరేవుల దళితవాడతోపాటు వంద కుటుంబాలకుపైగా ఇక్కడ నివాసం ఉంటున్నాయి. వీరి ఇళ్ల నుంచి వచ్చే మురుగంతా గతంలో ఓ రైతు పొలంలోకి వెళుతుండేది. ఆ రైతు తన పంట నాశనం అవుతుందని మురుగు పొలంలోకి రాకుండా అడ్డుకట్ట వేశాడు. దీంతో మురుగంతా గ్రామ సమీపాన ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయం పక్కన చేరి.. కుంటను తలపిస్తోంది. భక్తులు దుర్గంధం నడుమ పూజలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. మరోవైపు దోమలు, విషపురుగులు చేరాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



స్తంభించిన మురుగు

ఈటీపీ సిద్ధమయ్యాకే డైయింగ్ యూనిట్లు ప్రారంభించాలి: కమిషనర్



డైయింగ్ యూనిట్ల యజమానులతో చర్చిస్తున్న కమిషనర్ కృష్ణారెడ్డి

నగరి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఈటీపీ (రంగు నీటిని శుద్ధి చేసే ప్లాంటు)ని సిద్ధమయ్యాకే డైయింగ్ యూనిట్లు ప్రారంభించాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో డైయింగ్ యూనిట్ల యజమానులతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. మున్సిపల్ పరిధిలో 70 డైయింగ్ యూనిట్లుండగా కేవలం 11 మంది మాత్రమే హాజరయ్యారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, డీఈ, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమానికి మద్దతివ్వండి

మంత్రిని ఆహ్వానించిన బీసీ సంఘం నేత

చిత్తూరు అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల ఆరో తేదీన నిర్వహించ తలపెట్టిన హలో బీసీ.. చలో ఢిల్లీ కార్యక్రమానికి మద్దతు ఇవ్వాలని మంత్రి కొల్లు రవీంద్రను బీసీ సంక్షేమ సంఘం దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జి షణ్ముగం కోరారు. శుక్రవారం విజయవాడలోని మంత్రి నివాసంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు షణ్ముగం తెలిపారు.



మంత్రి కొల్లు రవీంద్రకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న షణ్ముగం

ఇంటి పట్టాలిచ్చి.. స్థలాలు చూపించకుంటే ఎలా?: సీపీఐ

విజయపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జగనన్న పేరుతో ఇంటి పట్టాలు ఇచ్చి.. స్థలాలు చూపలేదని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. కేవీపురంలో సర్వే నెంబరు 183 పేరుతో సుమారు 70 పట్టాలు ఇచ్చి, స్థలాలు చూపలేదని చెప్పారు. ఆర్డీవో భవానీశంకరి, తహసీల్దార్ కిరణ్ మాట్లాడుతూ.. సర్వే చేసి ఇంటి స్థలాలు కేటాయిస్తామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోదండయ్య, నాయకులు ఏసుపాదం, జయలలిత, శారద, నందిని, సౌక్యమ్మ, చిన్నమ్మ, మునివేలు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు

రేపు మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు

చిత్తూరు అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం నగరంలో మాంసాహార విక్రయాన్ని నిషేధించామని నగరపాలక సంస్థ ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ లోకేష్ తెలిపారు. చికెన్, మటన్ స్టాల్స్ వారు, చేపల వ్యాపారులు తమ దుకాణాలను మూసివేయాలని సూచించారు. హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు కూడా మాంసాహారాన్ని విక్రయించకూడదన్నారు. ప్రభుత్వ ఆదేశానికి భిన్నంగా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

11 మంది పేకాటరాయుళ్లపై కేసు

చిత్తూరు అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పేకాడుతున్న 11 మందిపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు..నగరంలోని కోర్టు ఎదురుగా ఉన్న ఓ సిమెంట్ దుకాణంవద్ద పేకాడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దాడులుచేసి.. 11మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేశారు. పేకాటరాయుళ్ల వద్ద నుంచి రూ.40,500 సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోండి

పదో తరగతి విద్యార్థులకు ఎస్‌ఎస్ ఏపీసీ సూచన



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎస్‌ఎస్ ఏపీసీ వెంకటరమణ

ఐరాల(కాణిపాకం), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తుకు పదో తరగతి విద్య కీలకం అని సమగ్ర శిక్ష అడిషనల్‌కోఆర్డినేటర్ (ఎస్‌ఎస్ ఏపీసీ) వెంకటరమణ అన్నారు. శుక్రవారం కాణిపాకం జడ్పీ హైస్కూల్‌లోని విద్యార్థులతో ముచ్చటించారు. ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు రుష్యేంద్రబాబు, దామోదర్‌నాయుడు, హెచ్‌ఎం చంద్రశేఖర్‌నాయుడు, టీచర్లు పాల్గొన్నారు.

ఘనంగా బాలికా దినోత్సవం

నగరి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ బాలికా దినోత్సవాన్ని వాడవాడలా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో బాలికా సంరక్షణపై అవగాహన కల్పించారు. నగరి కొత్తపేటలోని బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో కృష్ణవేణి పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

విజయపురం: మండల కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు బాలికలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ లక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాలసముద్రం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో వినుతాశ్రీ, హెచ్‌ఎం మీనాక్షి, సూపర్‌వైజర్లు అనురాధ, సంగీత తదితరులు పాల్గొన్నారు.

గుడిపాల: బొమ్మసముద్రం హైస్కూల్‌లో విద్యార్థినులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం విజయలక్ష్మి, అంగన్వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో పద్మసునంద, హెచ్‌ఎం గాయత్రి, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు. ● వెదురుకుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణశారద, వైస్ ప్రిన్సిపాల్ బీఎల్‌పీ లత, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సి.మంగళగౌరి పాల్గొన్నారు.



విజయపురంలో బాలికలతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

నింద్ర: కొత్త ఆరూరు ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం గిరిజావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజరు శ్యామల, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: గంగాధరనెల్లూరు, తూగుండ్రం హైస్కూల్స్‌లో జరిగిన కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు బిందుమాలతి, నాగరత్నమ్మ, సచివాలయం మహిళా పోలీస్ నిర్మల, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన అరుణాచల విద్యార్థులు



చిత్తూరు సెంట్రల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మిట్టూరులోని అరుణాచల డిగ్రీ కళాశాలలో ఫస్ట్‌ఫోకస్ కంపెనీ శుక్రవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో బీఏ, బీకాం. బీఎస్సీ డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న 12 విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ ఎన్.జగన్నాథరెడ్డి తెలిపారు. వార్షిక వేతనం కింద రూ.3 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను ప్రిన్సిపాల్ సునంద, అధ్యాపకులు అభినందించారు.

సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దు



గల్లా ఫుడ్స్ ఆవరణంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, ఉద్యోగులు

పూతలపట్టు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ కోరారు. రంగంపేట సమీపాన ఉన్న గల్లా ఫుడ్స్ ఆవరణంలో శుక్రవారం సాయంత్రం ఆ కంపెనీ ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు జరిగాయి. పూతలపట్టు సిక్స్‌లేన్ రహదారి నుంచి గల్లా ఫుడ్స్ ప్రాంగణం వరకు భద్రతా ప్రమాణాలను ప్రజలకు వివరిస్తూ రోడ్డు సేఫ్టీ ర్యాలీ నిర్వహించారు. మంగళ్ ఇండస్ట్రీస్, అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ హెడ్ ప్రశాంత్ తివారి, డీన్ రవికుమార్, గల్లా ఫుడ్స్ బిజినెస్ హెడ్ శ్రీరామ్, సోమశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి

విజయపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గంగవరాంబాపురంలో గాలి జగదీష్‌నాయుడు మామ టీడీపీ కార్యకర్త మునినాదం నాయుడు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పూలమాలవేసి, నివాళి అర్పించారు. చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి నల్లపనేని చినబాబు, మండల పార్టీ అధ్యక్షుడు రమేష్‌రాజు, మండల ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు బాలాజీ నాయుడు, వాసునాయుడు సంతాపం తెలిపారు.



కార్యకర్త మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

సంక్షిప్తంగా..

ద్రౌపది అమ్మవారికి పూజలు

వెదురుకుప్పం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ద్రౌపది అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పశు ఆరోగ్య వైద్య శిబిరాలు

బంగారుపాళ్యం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పశు ఆరోగ్య వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం తుంబపాళ్యంలో జరిగిన శిబిరాన్ని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ ప్రారంభించారు. చూలు కట్టని పశువులకు వైద్యం అందించి, వాటి యజమానులకు మందులు పంపిణీ చేశారు. నాయకులు గురుస్వామి, దామోదరం, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: పుల్లూరు గ్రామంలో జరిగిన శిబిరంలో పశువైద్యాధికారి శ్రీవిద్య, సిబ్బంది పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ

చిత్తూరు సెంట్రల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా సేవా సంఘం ఎస్సీ, ఎస్టీ ఉపాధి హామీ సిబ్బంది ముద్రించిన డైరీని కలెక్టర్ సుమిత్ కుమార్ డ్వామా పీడీ రవికుమార్‌తో కలిసి శుక్రవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు గుణశేఖర్, అన్నామలై, మురగేషన్, కిరణ్, విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ముద్రించిన క్యాలెండర్‌ను కూడా కలెక్టర్ ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సులోచన, నాయకులు మురళి, మహేష్, పొన్నయ్య, కుమారి తదితరులు పాల్గొన్నారు.

నెల్లేపల్లెలో సీఎస్‌ఐ చర్చి ప్రారంభం



చర్చి ప్రారంభోత్సవంలో పాల్గొన్న బిషప్ హెన్రీ శర్మ నిత్యానందం

గంగాధరనెల్లూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు మండలం నెల్లేపల్లెలో సీఎస్‌ఐ చర్చిని బిషప్ హెన్రీ శర్మ నిత్యానందం శుక్రవారం ప్రారంభించారు. మాజీ సర్పంచ్ పుష్పరాజ్, మాజీ ఎంపీపీ ప్రగతి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ద్విచక్రవాహనం చోరీ

చిత్తూరు రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని తాళంబేడు గ్రామానికి చెందిన లవకుమార్‌కు చెందిన ద్విచక్రవాహనం చోరీకి గురైనట్లు శుక్రవారం బీఎన్ఆర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం రాత్రి ఇంటి ముందు ఉంచిన ద్విచక్రవాహనం తెల్లవారేసరికి కనపడలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా స్వాధీనం

వెదురుకుప్పం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సారా స్థావరాలపై దాడులు జరిపి 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 1200 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. ఈ మేరకు చిత్తూరు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంటు ఇన్‌స్పెక్టరు సత్యనారాయణ తెలిపారు.

బంగారు షాపులో చోరీ సొత్తు స్వాధీనం?



బంగారుషాపులో తనిఖీలు నిర్వహిస్తున్న పలమనేరు పోలీసులు

బంగారుపాళ్యం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ బంగారు షాపులో చోరీ సొత్తును పలమనేరు పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. గత ఏడాది డిసెంబరులో ఓ ఇంట్లో చోరీ జరిగిన కేసులో పలమనేరు పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. బంగారుపాళ్యంలోని ఓ షాపులో చోరీ చేసిన బంగారాన్ని తాకట్టు పెట్టినట్లు తెలిపాడు. దీంతో శుక్రవారం పలమనేరు సీఐ నరసింహారాజు, సిబ్బంది సంబంధిత షాపులో తనిఖీలు చేసి, చోరీకి గురైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.